సోమవారం 17 జూన్ 2024

తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 69 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

విలేకరులు కావలెను

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834

10 ఏళ్ల తరువాత కాంగ్రెస్‌కి ఆ అవకాశం

- జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో ప్రతిపక్షాలకు ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకునే అవకాశం రాలేదు
- మొదటి, రెండు, మూడో లోక్‌సభలో ఈ పదవి ఖాళీగా ఉండేది
- ప్రతిపక్ష నాయకుడి పదవి కేబినెట్ మంత్రితో సమానంగా ఉంటుంది
- కేంద్ర మంత్రితో సమానంగా జీతం, అలవెన్సులు, ఇతర సౌకర్యాలను పొందుతారు
- వసతి, డ్రైవర్‌తో కూడిన కారును అందిస్తారు
- ప్రతిపక్ష నాయకుడికి కూడా సిబ్బంది ఉంటారు

ఢిల్లీలో నీటి సంక్షోభం

- జల్ బోర్డు వద్ద నిరసనలో ఉద్రిక్తత!
- జల్ బోర్డు కార్యాలయంపై బీజేపీ కార్యకర్తల దాడి
- ఢిల్లీలో తీవ్రస్థాయిలో నీటి ఎద్దడి
- జల్ బోర్డు వద్ద బీజేపీ కార్యకర్తల నిరసన
- ఖాళీ కుండలతో దాడి
- జల్ బోర్డు కార్యాయంలో కంప్యూటర్లు, ఫర్నిచర్ ధ్వంసం

రెండు విడతల్లో రైతు రుణమాఫీ

- రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు వేగవంతం
- విడదల వారీగా రుణమాఫీ అమలు పైన సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది
- ఒకటి రెండు రోజుల్లో నే అధికారికంగా నిర్ణయం వెలువడనుంది.
- జులై 15 నుంచి రూ.50వేల లోపు, ఆ తర్వాత రూ. 75వేలు, రూ.లక్ష.. ఇలా పెంచుతూ బ్యాంకులకు జమ చేసే విధానాన్ని పరిశీలిస్తోన్న సర్కారు
- రైతుల్లో 70 శాతం మందికి రూ. లక్ష లోపు రుణం ఉన్నట్లు అంచనా
- తొలి దశలో వీరికి మాఫీ చేసి మిగిలిన వారికి ఆగస్టు 15లోగా జమ చేయాలనే అంశంపైనా చర్చ
- ఇక అటు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలకు 2 నెలల్లో రూ. 30 వేల కోట్లు అవసరమని ప్రభుత్వ వర్గాల అంచనా

హైదరాబాద్

తెలంగాణలో రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఆగస్టు 15 లోగా రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని రేవంత్ ప్రమాణం చేసారు. దీంతో, రుణమాఫీ అమలు మార్గదర్శకాల పైన అధికార యంత్రాంగం ఫోకస్ చేసింది. బ్యాంకర్లతోనూ చర్చలు కొనసాగుతున్నాయి. విడదల వారీగా రుణమాఫీ అమలు పైన సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో నే అధికారికంగా నిర్ణయం - మిగతా3లో

కష్టపడి చదివే తమ పిల్లల

ఆశలపై నీళ్లు చల్లింది

- పరీక్షా పే కాదు.. నీట్ ఎగ్జామ్‌లో అవకతకవలపై మోదీ స్పందించాలి..
- ఓవైపు బీహార్‌లో రూ.30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారు
- ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయి
- ప్రతిసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని.. కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్

కష్టపడి చదివే తమ పిల్లలు డాక్టర్ కావాలని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలపై గందరగోళంగా మారిన నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఓవైపు బీహార్‌లో రూ.30 లక్షల చొప్పున నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఆది నుంచి నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్‌పై ఇన్ని ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ మోదీ సర్కార్ ఇప్పటి - మిగతా3లో

మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకున్న బైపాస్ రోడ్ బాధితులు

- నల్లగొండ జిల్లాలో బైపాస రోడ్డు వల్ల తమ బతుకులు రోడ్డున పడుతున్నాయాంటూ గత కొద్దీ రోజులుగా ఆందోళన
- అవసరమైతే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని హామీ

నల్లగొండ

రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నల్లగొండ బైపాస్ రోడ్ బాధితులు ఘోరావ్ చేశారు. బైపాస్ రోడ్డు వల్ల తమ బతుకులు రోడ్డున పడుతున్నాయాంటూ గత కొద్దీ రోజులుగా ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం కనగల్ మండలం దర్వేషిపురం వెళ్తుండగా మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంత్రికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే ఈ విషయంలో తానేమీ చేయలేను అంటూ మంత్రి అనడంతో బాధితులు కాళ్లవేళ్ల పడ్డారు. మంత్రి కోమటిరెడ్డి స్పందిస్తూ అవసరమైతే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని హామీ ఇస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కూరగాయలు

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు..
- అల్లాడుతున్న సామాన్య ప్రజలు..
- ఏ వస్తువు టచ్ చేసినా భగ్గుమంటున్న ధరలతో ప్రజలకు చుక్కలు
- పప్పు నుంచి ఉప్పు వరకు, కరివేపాకు నుంచి కాకరకాయ వరకు చికెన్ నుంచి అల్లం, వెల్లుల్లి వరకు ఏది చూసినా అధిక ధరలు
- వేసవి దెబ్బతో పాటు దిగుబడి లేక పెరిగిన ధరలతో అల్లాడిపోతున్న అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారస్తులు

హైదరాబాద్

పెరుగుతున్న నిత్యవసర ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఏ వస్తువు టచ్ చేసినా భగ్గుమంటున్న ధరలతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పప్పు నుంచి ఉప్పు వరకు, కరివేపాకు నుంచి కాకరకాయ వరకు చికెన్ నుంచి అల్లం, వెల్లుల్లి వరకు ఏది చూసినా అధిక ధరలు ఉన్నాయి. గత పది రోజులుగా పెరుగుతున్న ధరలతో మార్కెట్ ధరల బోర్డ్?లో రేట్లు సాధారణం కంటే రెట్టింపుకు చేరుకున్నాయి. వేసవి దెబ్బతో పాటు దిగుబడి లేక పెరిగిన ధరలతో అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారస్తులు ఇద్దరు అల్లాడిపోతున్నారు. ఒకప్పుడు కూరగాయల కొనాలంటే వంద పెడితే సంచి నిందేది. కానీ ఇప్పుడు రూ.500 పెట్టినా రెండు రకాల కూరగాయలు, ఇద్దరు మనుషులకు సరిపోయేవి రావడం లేదు. ఇక కూరగాయలతో - మిగతా3లో

కొత్త క్రిమినల్ చట్టాలు జూలై 1 నుంచి అమలు

- ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లలో మార్పు
- తగిన సంప్రదింపుల ప్రక్రియ, లా కమిషన్ నివేదిక ఆధారంగా మూడు చట్టాల్లోనూ మార్పులు చేశాం
- ఈ చట్టాలకు సంబంధించి అన్ని రాష్ట్రాల్లోనూ తగిన శిక్షణ ఇశాం
- ఇందుకు అవసరమైన శిక్షణను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ అందిస్తుంది
- కేంద్ర న్యాయ శాఖ సహాయమంత్రి (స్వతంత్ర హోదా) అర్జున్ మేఘ్వాల్

10 ఏళ్ల తరువాత కాంగ్రెస్‌కి ఆ అవకాశం

ఢిల్లీ: గడిచిన 10 ఏళ్లలో ఎన్డీఏ కూటమికి తిరుగులేని మెజారిటీ ఉండటంతో లోక్ సభలో ప్రతిపక్షాల బలం నామమాత్రంగానే ఉండింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ 2014, 2019 ఎన్నికల్లో చతికిలపడి దిగువసభలో ప్రతిపక్ష నాయకుడి పాత్రకు దూరమైంది. ఈ మధ్యే జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీ 10 శాతం కంటే ఎక్కువగా లోక్ సభ సభ్యులను గెలిపించుకుంది. దీంతో 10 ఏళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీకి లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు ఉండనున్నాడు. 2014 నుంచి ఈ పదవి ఖాళీగా ఉండగా, ఈసారి కాంగ్రెస్‌కు సరిపడా సీట్లు వచ్చాయి. గత పదేళ్లలో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య మొత్తం లోక్‌సభ సభ్యులలో 10 శాతం కంటే తక్కువగా ఉండింది. ప్రతిపక్ష స్థానం ఖాళీ కావడం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా దేశంలో ఎనిమిది సార్లు ఇలాగే జరిగింది.

మొదటిసారి..

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో ప్రతిపక్షాలకు ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకునే అవకాశం రాలేదు. మొదటి, రెండు, మూడో లోక్‌సభలో ఈ పదవి ఖాళీగా ఉండేది. నాలుగో లోక్‌సభలో తొలిసారిగా రామ్ సుభాగ్ ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఐదు, ఏడు, ఎనిమిదో లోక్‌సభలో కూడా ఈ పదవి ఖాళీగా ఉంది. 2014 -16వ లోక్‌సభ ఎన్నికల్లోనూ, 2019లో జరిగిన 17వ లోక్‌సభలోనూ ప్రతిపక్షాలు ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకోలేకపోయాయి. 18వ లోక్‌సభలో తొలిసారిగా నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష నేతను నియమించే అవకాశం విపక్షాలకు దక్కింది. లోక్‌సభలో మొత్తం ఎనిమిది సార్లు ప్రతిపక్ష నాయకుడి పదవి ఖాళీగా ఉంది.

కాంగ్రెస్‌కు మంచి అవకాశం

2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 240 సీట్లు గెలుచుకుంది. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 292 లోక్‌సభ స్థానాలతో సంపూర్ణ మెజారిటీని పొందింది. కాంగ్రెస్ 99 స్థానాలను గెలుచుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 52 సీట్లు మాత్రమే సాధించగలిగింది. అయితే ఈసారి ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకునేంత సీట్లు రావడంతో కాంగ్రెస్ పార్టీ వర్గాలు సంతోషంగా ఉన్నాయి.

ప్రతిపక్ష నాయకుడి పదవి కేబినెట్ మంత్రితో సమానంగా ఉంటుంది.

కేంద్ర మంత్రితో సమానంగా జీతం, అలవెన్సులు, ఇతర సౌకర్యాలను పొందుతారు. వసతి, డ్రైవర్‌తో కూడిన కారును అందిస్తారు.

ప్రతిపక్ష నాయకుడికి కూడా సిబ్బంది ఉంటారు.

ప్రతిపక్ష నాయకుడు పబ్లిక్ అకౌంట్స్, పబ్లిక్ అండర్‌టేకింగ్స్, ఎస్టిమేట్స్ వంటి ముఖ్యమైన కమిటీలలో సభ్యుడిగా ఉంటాడు. అనేక జాయింట్ పార్లమెంటరీ కమిటీలలో సభ్యుడిగానూ ఉంటాడు.

సీబీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ అధిపతులను నియమించే సెలక్షన్ కమిటీలలో ప్రతిపక్ష నాయకుడిని సభ్యుడిగా చేస్తారు.

పార్లమెంట్‌లో ప్రభుత్వ విధానాలను విమర్శించే స్వేచ్ఛ ప్రతిపక్ష నేతకు ఉంటుంది.

ప్రయాణికుడికి చుక్కలు చూపించిన ఎయిర్ ఇండియా

బస్సు ప్రయాణం, రైలు ప్రయాణమన్న తర్వాత ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ, ఎవరో ఒక్కరికి అసౌకర్యం కలుగుతుంటుంది. రూ.10లు, రూ. 100లు చెల్లించి టికెట్ కొనుగోలు చేస్తారు. కాబట్టి ఆ యా ప్రయాణికులు సర్థుకు పోతుంటారు. కానీ అదే రూ.5 లక్షలు పెట్టి టికెట్ కొనుగోలు చేసి విమాన ప్రయాణం.. అదీకూడా బిజినెస్ క్లాస్ విమానంలో యాణికుడికి‘పదనిసలు’తప్పలేదంటే.. అతడు ఎంత వేదనకు గురై ఉంటాడు. ఎయిర్ ఇండియా బిజినెస్ క్లాస్ విమానంలో తన ప్రయాణంలో కలిగిన చేదు అనుభవాన్ని బాధితుడు వినీత్ కే. తన ఎక్స్ ఖాతా వేదికగా పంచుకున్నాడు. తాజాగా దేశ రాజధాని న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ కంటే.. 25 నిమిషాల ఆలస్యంగా విమానం టేక్ ఆఫ్ అయింది. ఇక విమానంలో సీట్ శుభ్రంగా లేదు.. బాగా మాసి పోయి ఉంది. అలాగే సీట్లకు ఉండే కవర్లు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయి. నిద్రకు ఉపక్రమించే క్రమంలో సీటు వెనక్కి నెట్టితే వెళ్ల లేదు. ఇక విమాన సిబ్బంది తనకు సరఫరా చేసిన ఆహారం సైతం చెత్తగా ఉంది. మరోవైపు విమానంలో టీవీ సైతం పని చేయకపోవడం మరో విశేషం. తన లగేజీకి ఉన్న ట్యాగ్ ఊడిపోయింది. అంతేకాదు తన సూట్ కేసు హ్యాండిల్ సైతం పగిలిపోయింది, లగేజ్ జిప్ ఆచూకీ లేకుండా పోయింది. దీంతో సదరు విమాన ప్రయాణంలో తనకు కలిగిన కష్టాలకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా వివేక్ కే పంచుకున్నాడు. అయితే తాను తరచు న్యూయార్క్, లండన్, షికాగో ప్రయాణిస్తూ ఉంటానన్నారు. ఆ క్రమంలో ఎమిరెట్

సంస్థకు చెందిన విమానాల్లో ఎక్కువగా ప్రయాణం సాగిస్తూ ఉంటానని గుర్తు చేసుకున్నారు. అయితే తాజాగా ఎయిర్ ఇండియా బిజినెస్ క్లాస్ విమానంలో ప్రయాణం చేయాలనుకున్నానని తెలిపారు. అదీకూడా న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు నేరుగా ఈ సర్వీస్ ఉండడంతో.. ఈ ఎయిర్ ఇండియా సర్వీస్‌ను ఎంచుకున్నట్లు చెప్పారు. ఇక నిన్న ఈ విమాన ప్రయాణం తనకో పీడకల అని వివేక్ కే. అభివర్ణించారు. ఇక వివేక్ కే. ఎక్స్ వేదికగా స్పందించిన ఘటనపై ఎయిర్ ఇండియా సంస్థ ఎక్స్ వేదికగా స్పందించింది. ఆ కొద్ది సేపటికే దానిని ఆ సంస్థ తన ఖాతా నుంచి తొలగించింది. మరోవైపు వివేక్ కే తన విమాన ప్రయాణంలో కలిగిన కష్టాలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి సింగపూర్ వెళ్లే క్రమంలో ఎయిర్ ఇండియా విమానంలో ఇదే తరహా అనుభవం గతంలో తనకు ఎదురైందని కామెంట్ చేశాడు.

ఢిల్లీలో నీటి సంక్షోభం..

దేశ రాజధాని ఢిల్లీలో నీటి కొరతపై రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఓ వైపు నీటి సమస్యపై జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. సమస్యలపై బీజేపీ నిరసనలను తీవ్రతరం చేసింది. ఆదివారం ఛతర్‌పూర్ ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయాన్ని బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. దీంతో జల్‌బోర్డు వద్ద నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. దేశ రాజధానిలో నీటి సంక్షోభంపై బీజేపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు వద్దకు ఆ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీలో నీటి సంక్షోభంపై బీజేపీ కార్యకర్తలు జల్ బోర్డు వద్ద ఖాళీ కుండలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆప్ ప్రభుత్వ తీరు పట్ల వారు మండిపడుతున్నారు.

జల్ బోర్డు వద్దకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ఓ దశలో బీజేపీ కార్యకర్తలు జల్ బోర్డు కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. కుండలు విసరడంతో కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం అయ్యాయి. దీనిపై బీజేపీ నేత రమేశ్ బిధూరీ స్పందిస్తూ... ప్రజల్లో ఆగ్రహం నెలకొన్నప్పుడు వారు ఏమైనా చేస్తారని వ్యాఖ్యానించారు. జల్ బోర్డు ప్రభుత్వ ఆస్తి మాత్రమే కాదు... ప్రజల ఆస్తి కూడా... ప్రజా ఆస్తులను ధ్వంసం చేయొద్దు అని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నిరసనలపై ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా పైపులను ధ్వంసం చేసింది ఎవరు? ఎవరి కుట్ర ఇది? అంటూ బీజేపీపై మండిపడ్డారు. కుండలు విసరడంతో బోర్డులోని ఫర్నీచర్, కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. మరో వైపు ద్వారకలో నీటి వివాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయపడ్డారు. పోలీసుల

వివరాల ప్రకారం.. ద్వారక జిల్లా ప్రాంత్రంలో సాధారణ కుళాయి నీళాయి వద్ద నీరు పట్టుకునే విషయంలో వివాదం చోటు చేసుకోగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని ఇందిరాగాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో ఈశాన్య ఢిల్లీకి చెందిన బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ఢిల్లీలో నీటి కొరతపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ‘మట్కా-ఫోడ్’ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నీటి ఎద్దడి నెలకొంటుందని.. మంత్రి అతిషి ఎవరిని మోసం చేస్తున్నారన్నారు. పైప్‌లైన్ మార్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ‘వారంతా సోమరిపోతులు.. వారికి ఎలాంటి వ్యూహం లేదు. ఉద్దేశం లేదు. ఖజానాను దోచుకోవడమే వారికి కావాలి’ అని బీజేపీ నేత రమేశ్ బిధూరి విమర్శించారు. ఇది అవినీతి ప్రభుత్వమని.. అవినీతి నుంచి తమను తాము రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ జల్ బోర్డులో ఎలాంటి ఆడిట్ జరుగలేదని.. రూ.70వేలకోట్ల నష్టంలో ఉందన్నారు. ఈ ప్రభుత్వం నుంచి విముక్తి పొందాలని డిమాండ్ చేశామన్నారు. ఛతర్‌పూర్‌లోని ఢిల్లీ జల్ బోర్డు కార్యాలయంలో జరిగిన విధ్వంసంపై ఆయన మాట్లాడుతూ.. ఇది సహజమేనని.. ప్రజలు కోపంగా ఉంటే.. ఏదైనా చేయగలరని.. ప్రజలను నియంత్రించిన కార్యకర్తలకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు జూలై 1 నుంచి అమలు...

న్యూఢిల్లీ: మూడు కొత్త క్రిమినల్ చట్టాలు ‘భారతీయ న్యాయ్ సంహిత’, ‘భారతీయ సురక్షా సంహిత’, ‘భారతీయ సాక్ష్య అభినయం’ ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్నట్టు కేంద్ర న్యాయ శాఖ సహాయమంత్రి (స్వతంత్ర హెూదా) అర్జున్ మేఘ్వాల్ ఆదివారంనాడు తెలిపారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లలో మార్పు జరిగిందని, తగిన సంప్రదింపుల ప్రక్రియ, లా కమిషన్ నివేదిక ఆధారంగా మూడు చట్టాల్లోనూ మార్పులు చేశామని చెప్పారు. మూడు చట్టాలు కొత్త పేర్లతో అమల్లోకి వస్తాయని, ఈ చట్టాలకు సంబంధించి అన్ని రాష్ట్రాల్లోనూ తగిన శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇందుకు అసవరమైన శిక్షణను బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ అందిస్తుందని చెప్పారు. జ్యుడిషియల్ అకాడమీలు, నేషనల్ లా యూనివర్శిటీలకు సైతం శిక్షణ ఉంటుందని, దేశంలో క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేసేందుకు ఈ మూడు కొత్త చట్టాలు కీలకమని మంత్రి మేఘ్వాల్ తెలిపారు. కాగా, భారతీయ నాగరిక్ సురక్ష సింహత కింద నేరాల తీవ్రతను బట్టి పోలీసు కస్టడీని 15 రోజుల నుంచి 90 రోజులకు పొడిగించనున్నారు. భారతీయ న్యాయ సంహితలో 358 సెక్షన్లు (ఐపీసీలో 511 సెక్షన్లకు బదులుగా) ఉంటారు. బిల్లులో కొత్తగా 20 నేరాలను కూడా చేర్చారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలో 532 సెక్షన్లు (సీఆర్‌పీసీలోని 484 సెక్షన్ల స్థానే) ఉంటాయి. 177 ప్రొవిజన్లను బిల్లులో మార్పు చేశారు. 9 కొత్త సెక్షన్లు, 39 సబ్ సెక్షన్లు చేర్చారు. భారతీయ సాక్ష్య అభియాన్‌లో 14 సెక్షన్లను మార్చడం, తొలగించడం జరిగింది. ఇందులో 170 ప్రొవిజన్లు (ఒరిజనల్ ప్రొవిజన్లు 167) ఉండగా, 24 ప్రొవిజన్లను మార్చారు. రెండు కొత్త ప్రొవిజన్లు, ఆరు సబ్ ప్రొవిజన్లు చేర్చగా, ఆరు ప్రొవిజన్లను బిల్లు నుంచి తొలగించారు. ముఖ్యమంగా మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా కట్టుదిట్టమైన మార్పులను కొత్త చట్టాల్లో తీసుకువచ్చారు.

ఎన్‌టీఏలో ప్రక్షాళన అవసరం

నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులైన ఎన్‌టీఏ అధికారులను ఉపేక్షించేది లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ పరీక్షల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్, పరీక్షల నిర్వహణలో అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. సుప్రీంకోర్టు సూచనలకు అనుగుణంగా 1563 మంది అభ్యర్ధులకు తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు చోట్ల అక్రమాలు జరిగాయని గుర్తించామని, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ఎన్‌టీఏ ఉన్నతాధికారులు ఎవరైనా దోషులుగా తేలితే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదని తేల్చిచెప్పారు. ఎన్‌టీఏలో ప్రక్షాళన అవసరమని, ఈ దిశగా చర్యలు చేపడతామని, తప్పులు చేసినవారు చర్యల నుంచి తప్పించుకోలేని విధంగా కార్యాచరణకు దిగుతామని వెల్లడించారు. నీట్ యూజీ 2024లో గ్రేస్ మార్కులు పొందిన విద్యార్ధుల ముందు రెండు మార్గాలున్నాయని, ఈనెల 23న మళ్లీ పరీక్ష రాసి జూన్ 30 నాటికి నూతన స్కోర్ పొందడం లేదా గ్రేస్ మార్కులు లేకుండా గతంలో సాధించిన స్కోర్‌ను ఆమోదించాలని స్పష్టం చేశారు. ఇక నీట్ పరీక్షల ప్రశ్నాపత్రం లీకేజ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ ఎలా అనుమతించారు : పృథ్వీరాజ్ చవాన్

ముంబై ఈవీఎం వివాదం పెను దుమారం రేపుతోంది. ఈ ఉదంతంపై మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ పలు సందేహాలు వ్యక్తం చేశారు. జూన్ 4న ముంబైలోని ఓ పోలింగ్ కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సమయంలో వివాదంపై జూన్ 14న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఈ విషయంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్‌ను ఎవరు అనుమతించారని, ఆ ఫోన్‌ను ఎందుకు వినియోగించారని ప్రశ్నించారు. ఓటీపీని జనరేట్ చేసి ఆ ఓటీపీతో ఈవీఎంలను తెరిచారని అన్నారు. ఇలాంటి ఎన్నో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. అసలు ఈ వ్యవహారంపై నమోదైన ఎఫ్ఐఆర్ కాపీని వెల్లడించడం లేదని, ఎఫ్ఐఆర్ విషయంలో గోప్యత పాటిస్తున్నారని మహారాష్ట్ర మాజీ సీఎం పేర్కొన్నారు. కాగా, ఈ వివాదంపై ముంబై సబర్బన్ రిటర్నింగ్ అధికారి వందన సూర్యవంశీ వివరణ ఇచ్చారు. ఈవీఎంను తెరిచేందుకు ఎలాంటి ఓటీపీ అవసరం లేదని స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతిక ఫీచర్లతో ఈవీఎం తయారవుతుందని, అందులో కమ్యూనికేషన్ డివైజ్ ఉండదని చెప్పారు. ఈవీఎంల్లో సాంకేతికంగా ఎలాంటి లోటుపాట్లు

కష్టపడి చదివే తమ పిల్లలు ఆశలపై నీళ్లు చల్లింది

-మొదటిపేజీ తరువాయి

వరకు స్పందించకపో వడం దారుణమని మండిపడ్డారు. ప్రతిసారి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని.. కీలకమైన నీట్ పరీక్షపై మాత్రం మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు, లక్షలాదిమంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి రాసిన బహిరంగ లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు.

గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం ఎన్నోరకాల అనుమానాలకు తావిస్తోందన్నారు. అందులోనూ ఒకే సెంటర్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే.. పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందని అన్నారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. అలాంటిది.. ఇంత ఒకే సెంటర్‌లో ఇంతమంది విద్యార్థులకు పెద్దమొత్తంలో మార్కులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. అలాగే ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు.. అసలు ఈ వ్యవహారం బయటకు రాగానే పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు ఈ అంశాన్ని ఇప్పటిదాకా పట్టించుకోలేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

లక్షలాది మంది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసిన కేంద్రం స్పందించలేదని, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా ఒక్క వివరణ కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని కేటీఆర్ అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కూడా కేంద్రం ఈ అంశాన్ని పట్టించుకోకపోవటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) చాలా చిత్రమైన సమాధానాలు చెప్పిందన్నారు. ఈ ఏడాది 1563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతోందని, అసలు నీట్ లాంటి ఎగ్జామ్‌లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేదని, అయినప్పటికీ ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1563 మంది విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో%ౌ%. దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ం4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్‌లో సాధ్యం కాని విధంగా కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ మొత్తం అంశం వివాదం కావటంతో ఇప్పుడు ఎన్టీఏ 1563 మందికి విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చామని వాటిని ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిందన్నారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాకింగ్‌నే జత చేస్తామని పూటకో మాట మాట్లాడుతోందని మండిపడ్డారు.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ను ప్రమాదంలోకి నెట్టి ఇప్పుడు వాస్తవాలు బయటకు రాకుండా నానాతంటాలు పడుతున్నారని మండిపడ్డారు.

ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టంచేశారు. దీనికి బలం చేకూరే విధంగా గుజరాత్, బీహార్ లో పోలీసులు నీట్‌లో అవకతవకలు పాల్పడిన కొంతమందిని అరెస్ట్ చేశారని, వరుసగా బయటపడుతున్న వివాదస్పద వ్యవహారాల కారణంగా నీట్ ఎగ్జామ్ తీరుపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా నీట్ ఎగ్జామ్‌ను పెద్దసంఖ్యలో విద్యార్థులు రాశారని, నీట్ లో జరిగిన గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా తెలంగాణ విద్యార్థులు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు మన రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించే విధంగా రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు ఎన్డీఏ సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇంత జరుగుతున్నా ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాల్సిన అవసరముంది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించిన ఈ అంశంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వెంటనే ప్రధాని దీనిపై స్పందించి మొత్తం అవకతవకలకు బాధ్యులెవరన్నది దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.. నీట్ లో జరిగిన అవకతవకల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా, వారికి న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇందులో ఎన్టీఏ %చీూ -% పాత్ర పై అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారితోపాటు.. అక్రమంగా లబ్దిపొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యంత ప్రతిష్టాత్మక నీట్ ఎగ్జామ్ మాత్రమే కాదు%ౌ% దేశంలోని ఎన్నో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఎన్టీఏ ఆధ్వర్యంలోనే జరుగుతున్నందున తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా దానిపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముందన్నారు.. నీట్ లో అక్రమాల కారణంగా కష్టపడి చదివిన మన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా అసలు ఊరుకునే ప్రసక్తే లేదని, వారి తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టంచేశారు.

గత సర్కారు నిర్లక్ష్యం: రేవంత్ సర్కారుకు తేల్చేసిన కేంద్రం

తెలంగాణలో గనుల వేలంపై కేంద్రం సీరియస్ అయ్యింది. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క మినరల్ బ్లాక్‌ను కూడా వేలం వేయలేదని కేంద్ర గనుల శాఖ పేర్కొంది. జూన్ 30 నాటికి కనీసం ఆరింటికి వేలం పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత తెలంగాణ సర్కారుకు స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి 11 బ్లాకుల జియాలాజికల్ నివేదికలను పంపినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

వీటిలో ఐదు సున్నపురాయి, ఐదు ఇనుప ఖనిజం, ఒకటి మాంగనీస్ బ్లాకు ఉన్నట్లు వెల్లడించారు. గనుల వేలంపై కేంద్ర గనుల శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు గుర్తు చేసినప్పటికీ.. ఒక్క బ్లాక్‌ను కూడా వేలం వేయలేదని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 30 నాటికి కచ్చితంగా కనీసం ఆరింటికి వేలం పూర్తిచేయాలని సూచిస్తూ తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర మంత్రిత్వశాఖ లేఖ రాసింది.

ఈ విషయంలో విఫలమైతే, ఆ ప్రక్రియను కేంద్రమే చేపట్టాల్సి వస్తుందని తేల్చి చెప్పింది. కాగా, దేశంలో గనుల వేలం(మినరల్ బ్లాక్స్ ఆక్షన్) ప్రక్రియ 2015లో ప్రారంభమైంది. 2021లో ఈ నిబంధనలను సవరించారు. వాటి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేయాలి. లేని పక్షంలో వాటిని నిర్వహించే అధికారం కేంద్రానికి వస్తుంది. ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా 354 ప్రధాన మినరల్ బ్లాక్‌లను వేలం వేశారు. 48 చోట్ల ఉత్పత్తి ప్రారంభమైంది. దీంతో సదరు రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది.

ఈ క్రమంలోనే, తెలంగాణలో మేజర్, మైనర్ మినరల్ బ్లాకులను వేలం పద్ధతిలో కేటాయించేందుకు గనులశాఖ సిద్ధమైందని, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఇటీవల తెలిపాయి. ఖనిజాల వారీగా ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. ఇందులో మూడు సున్నపురాయి బ్లాకులు కాగా, మరో 12 చిన్నతరహా ఖనిజాలని తెలిసింది తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం రాగానే వేలం ప్రక్రియను ప్రారంభించాలని గనుల మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేలంలో అర్హత సాధించిన వారికి ఆయా గనుల్ని 20 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే అవకాశం ఉంది.

రెండు విడతల్లో రైతు రుణమాఫీ

-మొదటిపేజీ తరువాయి

వెలువడనుంది.

ప్రభుత్వం కసరత్తు తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీకి సిద్ధం అవుతోంది. జులై 15 నుంచి దశలవారీగా రుణమాఫీ చేయాలని సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారు. గడువు సమీపిస్తుండటంతో రైతు రుణమాఫీకి ప్రభుత్వం కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. జులై 15 నుంచి రూ.50వేల లోపు, ఆ తర్వాత రూ. 75వేలు, రూ.లక్ష.. ఇలా పెంచుతూ బ్యాంకులకు జమ చేసే విధానాన్ని పరిశీలిస్తోంది. రైతుల్లో 70 శాతం మందికి రూ. లక్ష లోపు రుణం ఉన్నట్లు అంచనా. తొలి దశలో వీరికి మాఫీ చేసి మిగిలిన వారికి ఆగస్టు 15లోగా జమ చేయాలనే అంశంపైనా చర్చ సాగుతోంది. రైతుల రుణమాఫీ అమలు కోసం వృథాగా ఉన్న ప్రభుత్వ భూములను బ్యాంకుల్లో కుదువపెట్టి లోన్లు తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.

నిధుల కోసం మార్గాలు

ఇక అటు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలకు 2 నెలల్లో రూ. 30 వేల కోట్లు అవసరమని ప్రభుత్వ వర్గాల అంచనా. ఆగస్టులోగా ఆ మేర రుణాలు తీసుకుంటేనే స్కీమ్ ల అమలు సాధ్యమని సమాచారం. బాండ్ల విక్రయం ద్వారా అప్పు తీసుకోవాలని నిర్ణయించింది. అయితే ఏప్రిల్, మేలో రూ. 8,246 కోట్లు సేకరించగా.. మరో రూ. 2వేల కోట్లు 3 రోజుల్లో తీసుకొనుంది. ఈ ఏడాది కోటాలో మరో రూ. 30 వేల కోట్లు తీసుకునేందుకు ఆర్బీఐ అంగీకరిస్తుందా అనేది సందేహంగా మారుతోంది. దీంతో, బ్యాంకుల్లో కుదువపెట్టి లోన్లు తీసుకోవాలని భావిస్తున్నది. ఇట్లయితే రైతుల పంట రుణాలన్నీ ఒకేసారి మాఫీ చేయొచ్చని, ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే తనఖాపెట్టిన భూములను మెల్లమెల్లగా విడిపించుకోవచ్చని ఆలోచన చేస్తున్నది.

విడతల వారీగా అమలు ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల లోపు క్రాప్ లోన్లు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నిధుల సర్దుబాటు కోసం అన్ని మార్గాలను సర్కార్ అన్వేషిస్తున్నది. ఆర్థిక శాఖ ఇప్పటికే పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి ముందుంచింది. కొన్ని భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టడం ద్వారా కనీసం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు ఏకకాలంలో సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆర్బీఐ గవర్నర్?తో ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.

కూరగాయలు

-మొదటిపేజీ తరువాయి

చికెన్ కూడా పోటీ పడుతుంది. కేజీ రూ. 300కు దగ్గరలో ఉన్న చికెన్ ధరలతో అటు కూరగాయలు కొనలేక.. ఇటు చికెన్ తినలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు సామన్యులు. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పచ్చడి అన్నం తప్పేలా లేదంటున్నారు మధ్యతరగతి ప్రజలు. ఇక అన్ని వంటకాల్లో తప్పనిసరిగా ఉపయోగించే టమాటా ధర ఇప్పటికే హాఫ్ సెంచరీకి చేరింది. రేపో మాపో సెంచరీకి చేరువగా దూసుకుపోతోంది. టమాటా ధరలను చూస్తే వంట గదిలో స్టవ్ వెలిగించకుండానే మంటలు వస్తున్నాయి. రైతు మార్కెట్లో కేజీ రూ.50 గా విక్రయించబడుతున్న టమాటా ధర రిటైల్ మార్కెట్లో రూ.60 నుంచి రూ. 70 పలుకుతోంది. రాబోయే రోజుల్లో దీని ధరలు ఎంత పెరుగుతాయో అన్న ప్రశ్న ప్రతిఒక్కరిలో రేకెత్తుతోంది. ఇక మిగతా కూరగాయలు పరిస్థితి కూడా ఇలానే ఉన్నాయి. పచ్చిమిర్చి కేజీ రూ.44 ఉంటే, కాకరకాయ రూ.48, బెండ రూ.30 ,బీరకాయ రూ.44, క్యాలీఫ్లవర్ రూ.40 , క్యారెట్ రూ.45, బంగాళదుంపలు రూ.35, ఉల్లిపాయలు రూ.36 ,అల్లం రూ.194, వెల్లుల్లి రూ. 220 ఉంది. ఇవన్నీ రైతు మార్కెట్ ధరలు అయితే రిటైల్ మార్కెట్?లో ఇంతకు మించి ఉన్నాయి. ఎండ దెబ్బ.. సకాలంలో వర్షం లేకపోవడం.. దిగుబడి లేకపోవడం ఇలా అనేక కారణాలతో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. నెలాఖరు వరకు ఈ పరిస్థితి ఇలాగే ఉంటుందని.. రాబోయే రోజుల్లో టమాటా, పచ్చిమిర్చి, ఉల్లిపాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు మార్కెట్ వర్గాలు.

అరుణాచలం, సింహాచలం తరహాలో యాదాద్రిలో గిరి ప్రదక్షణ.. ఈ నెల నుంచే ప్రారంభం..!

గుడికి వెళ్లిన వారు ముందుగా గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఆలయంలోపలికి వెళ్లడం ఆనవాయితీ. తాము దర్శించే దేవస్థానం ఉన్న క్షేత్రానికంతటికీ ప్రదక్షిణ చేయటం సంప్రదాయం. గిరి ప్రదక్షిణ అనగానే మనకు గుర్తుకువచ్చేది 14 కిలోమీటర్ల అరుణాచల గిరిప్రదక్షిణ. మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని భక్తులు గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం ఏళ్లుగా సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ యాదాద్రి గిరి ప్రదక్షణకు కూడా అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. యాదగిరిగుట్ట కొండపై జ్వాలా నారసింహుడు, గండభేరుండ నారసింహుడు, యోగ నారసింహుడు, ఉగ్ర నరసింహుడు, లక్ష్మీ నరసింహుడు స్వయంభువులుగా వెలసిన పంచ నారసింహక్షేత్రంగా ఎంతో ప్రసిద్ధి. ఎన్నో ఏళ్లుగా స్థానిక భక్తులు మాత్రమే గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం జరుగుతోంది. అయితే 2016లో కోట్లాది రూపాయలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ దివ్యక్షేత్రాన్ని దేశంలోని ఇతర దివ్యక్షేత్రాల్లోని మరే ఆలయానికీ తీసిపోని రీతిలో వివిధ శిల్పకళా శైలుల వైభవం ఒకేచోట భక్తులకు కనువిందు చేసేలా అత్యంత అపురూపంగా పునర్నిర్మించారు. ఆలయ పూనర్ నిర్మాణంతో గిరి ప్రదక్షణ చేసేందుకు భక్తులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడగానే యాదగిరిగుట్టలో ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో బాగానే కొండపై స్వామివారి సన్నిధిలో భక్తులకు బస చేసే అవకాశం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోవడం, కొండపైకి ఆటోలను అనుమతించడం వంటి అంశాలను పునరుద్ధరించింది.

హైదరాబాదులో జగన్ నివాసం వద్ద అక్రమ కట్టడాల కూల్చివేత అనంతరం జీహెచ్ఎంసీ అధికారి బదిలీ

లోటస్ పాండ్‌లో జగన్ నివాసం వద్ద కొన్ని కట్టడాల కూల్చివేత

జోనల్ కమిషనర్ హేమంత్ ను జీఏడీలో రిపోర్ట్ చేయాలన్న జీహెచ్ఎంసీ కమిషనర్

ఉన్నత అధికారుల ఆదేశాలు లేకుండానే కూల్చివేతలు...?

హైదరాబాదు లోటస్ పాండ్ లోని ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద నిన్న కొన్ని అక్రమ కట్టడాలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బోర్కాడే హేమంత్ సహదేవరావును బదిలీ చేశారు. బోర్కాడే హేమంత్ సహదేవరావు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) వద్ద రిపోర్ట్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. జగన్ నివాసం వద్ద ఫుట్ పాత్ లను ఆక్రమించి సెక్యూరిటీ అవుట్ పోస్టులను నిర్మించారని, తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఫిర్యాదులతో ఈ కట్టడాలను కూల్చినట్టు తెలుస్తోంది. ఈ కూల్చివేతలకు ఉన్నతాధికారుల ఆమోదం తీసుకోకుండానే ముందడుగు వేయడం పట్ల తెలంగాణ సర్కారు తీవ్రంగా పరిగణించింది. అయితే, లోటస్ పాండ్ లో జగన్ నివాసానికి సమీపంలో నివాసం ఉంటున్న ఓ మంత్రి నిర్దేశించిన మేరకే జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఈ కూల్చివేతలకు ఉపక్రమించినట్టు సమాచారం.

విజయనగరంలో సగం మంది మహిళా నేతలే

విజయనగరం : చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పించాలంటూ దశాబ్దాలుగా మహిళలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి ప్రత్యేక రిజర్వేషన్లు లేకపోయినా ఆ జిల్లాలో మాత్రం 55% శాతం మహిళలే చట్టసభలకు వెళ్తుండటం అందరిని ఆశ్చర్యానికి గుర్తు చేస్తుంది. అంతే కాకుండా ఆ జిల్లాను నడుపుతున్న అధికారులు సైతం మహిళలే కావటం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇంతకీ 50 శాతం దాటి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ జిల్లా ఏది? అక్కడ మహిళలు ఎవరు? అనుకుంటున్నారా? అదే ఒకప్పుడు గజపతిరాజులు ఏలిన విజయనగరం. కానీ ఇప్పుడు మాత్రం ఆ జిల్లాను మహిళలు సమర్థవంతంగా పాలిస్తున్నారు. ఈ జిల్లాకు జిల్లా కలెక్టర్ గా జి.నాగలక్ష్మి ఉండగా, జిల్లా ఎస్పీగా ఎమ్. దీపిక పాటిల్ ఉన్నారు. వీరిద్దరి సమర్థవంతమైన పాలనలో జిల్లా ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించారు. అయితే అలా జరిగిన ఎన్నికల్లో ఈసారి అత్యధిక మంది మహిళలే అసెంబ్లీకి వెళ్ళటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆ తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులైన ఐదుగురు మహిళలు గెలుపొందారు. జిల్లా మొత్తం కూటమి క్లీన్ స్వీప్ చేస్తే వారిలో ఈ ఐదుగురు కూడా ఉన్నారు. అలా గెలిచిన వారిలో విజయనగరం నుండి గజపతి రాజుల వార సురాలైన అతిథి గజపతిరాజు ఉన్నారు. ఈమె మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు కుమార్తె గత ఎన్నికల్లో మొదటి సారి పోటీ చేసి ఓటమిపాలైన అదితి గజపతిరాజు ప్రస్తుత ఎన్నికల్లో మాజీ డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పై 62 వేల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇక ఎస్ కోట నుండి కోళ్ల లలితకుమారి మూడో సారి గెలుపొందారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చిన లలితకుమారి నలభై వేల భారీ మెజారిటీతో వైసిపి అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుపై గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. ఇక సాలూరు నుండి గుమ్మిడి సంధ్యారాణి వరుసగా నాలుగు సార్లు గెలిచారు. ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డిప్యూటి సీఎం పీడిక రాజన్నదొరపై గెలిచి సంచలనం సృష్టించారు. సంధ్యారాణి గతంలో ఎమ్మెల్సీగా పనిచేయగా, ప్రస్తుతం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులుగా కూడా ఉన్నారు. ఇక మరో అడవిబిడ్డ తోయక జగదీశ్వరి. ఈమె మాజీ డిప్యూటి సిఎం పాముల పుష్ప శ్రీవాణిపై గెలుపొందారు. అలాగే నెల్లిమర్ల నుండి జనసేన తరుపున పోటీచేసిన లోకం నాగ మాధవి నలభై వేల భారీ మెజారిటీతో గెలిచారు. ఇలా విజయనగరం నుండి పూసపాటి అదితి గజపతి రాజు, కురుపాం నుండి తోయక జగదీశ్వరి, సాలూరు నుండి టిడిపి పోలిట్ గుమ్మిడి సంధ్యారాణి, ఎస్ కోట నియోజకవర్గం నుండి కోళ్ల లలిత కుమారి, నెల్లిమర్ల నియోజకవర్గం నుండి లోకం నాగమాధవి గెలుపొందారు. జిల్లా నుండి గెలుపొందిన ఐదుగురు మహిళా ఎమ్మెల్యేల్లో నలుగురు మహిళలు మొదటి సారి అసెంబ్లీలోకి అడుగుపెడుతుండటం ఆసక్తిగా మారింది. అయితే గెలిచిన వారిలో సంధ్యారాణికి మంత్రిపదవి వరించింది. ఈ జిల్లాలో అత్యధికంగా గెలుపొందిన మహిళ ఎమ్మెల్యేలు ఉండటంతో వాళ్లకు పెద్దపీట వేసిన ఘనత తమదే అంటున్నారు కూటమి నేతలు.

విద్యుత్ ఒప్పందాల్లో అవకతవకలు లేవు.. ఏ విచారణకైనా సిద్ధం

విద్యుత్ కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి ఎక్కడా నష్టం జరగలేదని, ఆ విషయంలో ఏ విచారణకైనా సిద్ధమని రాష్ట్ర మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పారు. ఆదివారం తెలంగాణభవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం ఎంక్వయిరీ కమిషన్ వేసింది. గత ప్రభుత్వ చేసుకున్న ఒప్పందాలపై విచారణ చేస్తున్నది. ప్రభుత్వం లేవనెత్తిన సందేహాలకు అసెంబ్లీలో సమాధానం కూడా ఇచ్చాం. శ్వేత పత్రాలు కూడా విడుదల చేశాం' అని తెలిపారు. 'విద్యుత్ ఒప్పందాలపై విచారణకు ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ వేసింది. కమిషన్ సందేహాలకు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. పవర్ కమిషన్ ఉద్దేశం వేరేలా ఉంది. వాదన వినకుండా, విచారణ చేయకుండా తీర్పు ఇచ్చేలా కనపిస్తోంది. అందుకు నరసింహారెడ్డి విచారణ అర్హత లేదని, కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని సూచించారు. అన్ని ఆధారాలు చూపించారు' అని మాజీ మంత్రి చెప్పారు. 'వివరణ ఇచ్చేందుకు ఈ నెల 30 వరకు అవకాశం ఇవ్వాలని అడిగితే ఇవ్వలేదు. 15 లోపే వివరణ ఇవ్వాలన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి మారిపోయారు. తెలంగాణ వ్యక్తిగా ఉన్న వ్యక్తి ఇప్పుడు మారారు. చీకట్లో ఉన్న తెలంగాణను వెలుగుల తెలంగాణగ మార్చిన కేసీఆర్‌పై ఆయన సానుభూతి ఉంటుందనుకున్నాం. కానీ ఆయన తీరు అలా లేదు. ఆయన తన అభిప్రాయాన్ని ముందే మీడియాకు చెబుతున్నాడు. ఇది తప్పు' అని జగదీష్‌రెడ్డి చెప్పారు.

40 వేల కోట్ల భారం: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ అని కొత్త నాటకానికి తెర తీస్తున్నారని మండిపడ్డారు. రామగుండంలో కాదని దామర చర్లలో విద్యుత్ ప్లాంట్ పెడతారా...? అని ధ్వజమెత్తారు. అక్కడ నెలకొల్పడంతో బొగ్గు తరలింపు ఆర్థిక భారం కాదా అని నిలదీశారు. ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడ్డారని మండిపడ్డారు. లేదంటే సోలార్ గురించి ఎందుకు ఆలోచించలేదని నిలదీశారు. గత పదేళ్ల హయాంలో కేసీఆర్ చేయని తప్పు లేదని.. ఇవే తప్పులు చైనాలో చేసి ఉంటే ఉరి తీసేవారని విమర్శించారు. వివిధ ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ చేసిన ఆలోచిన తప్పయ్యిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శించారు.. దాంతో రూ.40 వేల కోట్ల ఆర్థిక భారం పడిందని వివరించారు. దొంగే.. పోలీసులను బెదిరించినట్టు కేసీఆర్ తీరు ఉందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ఏకపక్షంగా వాదిస్తున్నారని గుర్తుచేశారు. నరహింహా రెడ్డి నివేదిక ఏం ఇస్తారోననే భయం కేసీఆర్‌లో నెలకొందని పేర్కొన్నారు. అందుకే ఏకపక్షంగా వాదిస్తున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకల గురించి కేసీఆర్‌కు తెలుసు అన్నారు.

నారాయణ, కేశవ్‌లదే బాధ్యతంతా



నెల్లూరు : ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. చంద్రబాబుతో పాటు 24 మంది మంత్రుల శాఖలు ఖరారు అయ్యాయి. ఇక పాలన ప్రారంభించడమే తరువాయి అన్న చందంగా ఉంది. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీల మేరకు కీలక ఐదు ఫైళ్లపై చంద్రబాబు సంతకం చేశారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి సంబంధించి తొలి సంతకం చేశారు. సామాజిక పింఛన్లు, ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన వంటి ఫైళ్ళపై చంద్రబాబు సంతకం చేశారు. ఇది ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీల్లో కీలకమైనవిగా భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి ఉండాలన్నది ప్రజల అభిమతం. కేవలం సంక్షేమం మాత్రమే అమలు చేసిన జగన్ ను ప్రజలు తిరస్కరించారు. ఈ రాష్ట్రానికి మంచి రాజధాని కావాలి, ఆపై ఉద్యోగ, ఉపాధి కల్పన అవసరం. ఆ రెండింటిని అధిగమించాలంటే ఆర్థిక అవసరాలు చాలా కీలకం. అందుకే ఇద్దరు సీనియర్లకు ఆ బాధ్యత అప్పగించారు చంద్రబాబు. ఆర్థిక శాఖను పయ్యావుల కేశవ్ కు అప్పగించారు. మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖను పొంగూరు నారాయణకు కేటాయించారు. ఐదేళ్లపాటు సుస్థిర పాలన అందించాలంటే.. ఆర్థిక మద్దతు అవసరం. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం ఉండడంతో రాయితీలు, రుణాలు సాధించడం కీలకం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్థిక గణాంకాలతో సహా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే వారు కేశవ్. అటువంటిది అధికారంలోకి వచ్చి ఆర్థిక శాఖ ఆయన వద్ద ఉండటంతో.. ఎంతవరకు సక్సెస్ సాధిస్తారు అన్నది చూడాలి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధానిని ఎంపిక చేశారు. నాడు పట్టణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న పొంగూరు నారాయణకు అమరావతి బాధ్యతలను అప్పగించారు చంద్రబాబు. ఆయన అమరావతి విషయంలో కొంతవరకు సక్సెస్ అయ్యారు. విదేశీ కంపెనీలతో ఒప్పందాలు, పనులు శరవేగంగా జరపడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. నారాయణపై ఆ నమ్మకంతోనే మరోసారి మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖకు అప్పగించారు చంద్రబాబు. మిగతా22 మందికి.. ఎవరికి స్థాయికి తగ్గట్టు వారికి మంత్రిత్వ శాఖలను కేటాయించారు. కానీ టిడిపి కూటమి ప్రభుత్వం గట్టెక్కాలంటే మాత్రం.. ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్, అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతలను చూసే మంత్రిగా నారాయణ యాక్టివ్ గా పని చేయాల్సి ఉంటుంది.

అరుణ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ : మెదక్ పట్టణంలో జరిగిన ఘర్షణలో గాయపడిన అరుణ్ రాజును గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పరామర్శించారు. మియాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌ను రాజాసింగ్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజాసింగ్.. మెదక్ ఘటనలో పోలీసులు సరైన సమాయానికి స్పందించి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. తమ ఘోరక్షకులు పశువులు ఉన్నాయని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చారని చెప్పారు రాజాసింగ్. కానీ, వాటిని కాపాడటంతో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. నేరుగా వెళ్లి గోరక్షకులు వాటిని రక్షించే ప్రయత్నం చేశారన్నారు. అయితే, గోరక్షకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. పోలీసులకు సమాచారం అందించగానే స్పందించి ఉంటే.. అరుణ్ రాజు గాయపడేవాడు కాదన్నారు. హాస్పిటల్‌పైన.. డాక్టర్ కారుపైన దాడి చేసిన వారిపై కేసులు పెట్టారా? అని పోలీసులను రాజాసింగ్ ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై కాకుండా.. బీజేపీ కార్యకర్తలు, బీజేవైఎం కార్యకర్తలపై పోలీసులు కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ఫాలో చేయడంలో పోలీసులు విఫలం అవుతున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత హిందువులపై ఇంకా దౌర్జన్యాలు పెరిగాయన్నారు. బీజేపీ కార్యకర్తలకు, గోరక్షకులకు తాము అండగా ఉంటామని.. మెదక్‌లో గెలిచిన రఘునందన్ రావు అండగా ఉంటారని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

రఘునందన్ ఆధారాలతో రావాలి.. సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి సవాల్

సిద్దిపేట జిల్లా: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట రామిరెడ్డిపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేసిన ఆరోపణలు నిరాధారణమైనవని క్షీరసాగర్ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి అన్నారు. ములుగు మండల కేంద్రంలో ఈరోజు(ఆదివారం) బీఆర్ఎస్ పార్టీ నాయకుల మీడియా సమావేశం నిర్వహించారు. రఘునందన్ ఆధారాలు లేకుండా మాట్లాడుతూ గ్రామంలో కులాల , మతాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని అన్నారు. వెంకటరామిరెడ్డి మీద ప్రజల ఆస్తులు ఉంటే తాము దేనికైనా సిద్ధమని రఘునందన్‌కు సవాల్ విసిరారు. 30 రోజుల్లో వెంకట రామిరెడ్డి ఆస్తులను వాపస్ తీసుకుంటానని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు . తాము ఆయనకు 60 రోజుల గడువు ఇస్తున్నామని.. ఆధారాలతో రాకపోతే రఘునందన్ రావు బేషరతుగా తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని క్షీరసాగర్ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి సవాల్ విసిరారు.

మెదక్‌లో జంతువధ ఘర్షణల నేపథ్యంలో కొనసాగుతున్న బంద్..

మెదక్:పట్టణంలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. శనివారం జంతువధ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడడంతో ఇవాళ(ఆదివారం) బీజేపీ బంద్‌కు పిలుపునిచ్చింది. వర్తక, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఘర్షణల నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. గొడవలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బక్రీద్ పండగ సందర్భంగా మెదక్ పట్టణంలో జంతువధ నిషేధించాలంటూ నిన్న (శనివారం) మధ్యాహ్నాం ఓ వర్గం వారు నిరసనకు దిగారు. పట్టణంలోని బంగ్లా చెరువు వద్ద ఆవులు కనిపించడంతో వాటిని వధించేందుకు తెచ్చారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బంగ్లా చెరువు వద్ద ఉన్న గోవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నర్సిఖేడ్‌లోనూ ఆవులు ఉన్నాయన్న సమాచారంతో సీఐ అక్కడికి చేరుకుంటున్న సమయంలో ఓ వర్గానికి చెందిన వ్యక్తి మరోవర్గం యువకుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఇరువర్గాలు పెద్దఎత్తున రాళ్ల దాడికి దిగడంతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఘర్షణ నేపథ్యంలో ఆందోళన కారులు ఓ ప్రైవేటు ఆస్పత్రి అద్దాలు, కారు ధ్వసం చేశారు. రంగప్రవేశం చేసిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరకొట్టారు.

కేసీఆర్ లేఖపై స్పందించిన జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి

హైదరాబాద్ : విద్యుత్ కొనుగోళ్లపై వివరణ ఇస్తూ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాసిన లేఖపై పవర్ కమిషన్ చీఫ్, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి స్పందించారు. పవర్ కమిషన్‌కు కేసీఆర్ ఇచ్చిన వివరణ లేఖపై విచారణ మొదలుపెట్టిన జస్టిస్ నరసింహా రెడ్డి.. ఆ లేఖలో పేర్కొన్న అంశాలను పరిశీలించారు. లీగల్ అంశాలను సైతం లీగల్ టీమ్ పరిశీలించాలని పవర్ కమిషన్ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. కేసీఆర్ ఇచ్చిన వివరణలో సంతృప్తి చెందకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. లేఖ అంశంపై మీడియాతో మాట్లాడిన జస్టిస్ నరసింహా రెడ్డి.. కీలక కామెంట్స్ చేశారు. కేసీఆర్ పంపిన లేఖ తమకు అందిందన్నారు. కేసీఆర్ తన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారన్నారు. ఛత్తీస్‌గఢ్ పవర్ పర్చేస్, భద్రాద్రి యాదాద్రి ధర్మల్ పవర్ ప్లాంట్ అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారన్నారు. కేసీఆర్ చెప్పిన విషయాలను నిపుణుల కమిటీతో చర్చించాల్సి ఉందన్నారు. లెటర్‌లో కేసీఆర్ చెప్పిన అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఎవరికైనా తమ అభిప్రాయాలను నిస్సందేహంగా చెప్పే స్వేచ్ఛ ఉంటుందన్నారు. కేసీఆర్ తెలిపిన అభ్యంతరాలపై పునఃపరిశీలన జరుపుతామని జస్టిస్ నరసింహా రెడ్డి అన్నారు. జరిగిన పరిణామాలను మాత్రమే తాను మీడియా ముందు వివరించానని ఆయన చెప్పుకొచ్చారు. ఎవరి అభ్యంతరాలు వారికి ఉండటం సహజం అన్నారు. కేసీఆర్ చెప్పిన వివరాలకు, వాస్తవాలకు సరిపోల్చాల్సి ఉందని చెప్పారు. వాస్తవాలు ఏంటనేదానిపై %దీఎజూ% ప్రతినిధులని కూడా వివరాలు అడుగుతామని జస్టిస్ నరసింహారెడ్డి తెలిపారు. కేసీఆర్ పంపిన లెటర్‌పై మంగళవారం నాడు విశ్లేషణ జరుపుతామని.. దానికి అనుగుణంగానే తదుపరి చర్యలు ఉంటాయని జస్టిస్ నరసింహారెడ్డి చెప్పారు.